# నవజ్యోతి

తెలుగు దినపత్రిక

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 01 సంచిక : 286 | ఎడిటర్.: మన్నే లక్ష్మణ్ | వెల:5/- | పేజీలు: 8 | గురువారం 06-08-2026


## సమ్మక్క సాగర్ ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి



- కర్ణాటక సమావేశంపై సందేహాల వ్యక్తీకరణ
- 47 టీఎంసీల ప్రాజెక్టుపై ఆరోపణలు

2

## పొగాకు రైతుల అంశంపై బహిరంగ చర్చకు సవాల్

- జగన్ ఆరోపణలు అవాస్తవమన్న అచ్చె న్నాయుడు
- గణాంకాలతో చర్చకు రావాలని సవాల్



2



# గుజరాత్‌లో చండీపుర వైరస్ కలకలం

## 22 మంది చిన్నారుల మృతి.. ఏడుగురికి చికిత్స

- 35 మందికి వైరస్ నిర్ధారణ.. పలు జిల్లాల్లో కేసులు
- అరుదైన వైరస్‌పై ఆరోగ్య శాఖ అప్రమత్తం
- పిల్లల్లో లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచన

**గుజరాత్‌లో చండీపుర వైరస్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తోంది. ఈ వైరస్ బారినపడి ఇప్పటివరకు 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ప్రస్తుతం మరో ఏడుగురు చిన్నారులు రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.**

**డెస్క్, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**

వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టగా, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్త మయ్యారు. రాష్ట్రంలో నమోదైన 184 అనుమానిత కేసుల్లో 35 మందికి చండీపుర వైరస్ సోకినట్లు పరీక్షల్లో నిర్ధారణ అయిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రఫుల్ పన్సేరియా తెలిపారు. మరో 11 మంది నమూనాల పరీక్షా ఫలితాలు రావాల్సి ఉన్నాయని వెల్లడించారు. గాంధీనగర్, సబర్‌కాంత–హిమ్మత్‌నగర్, పటాన్, రాజ్‌కోట్, భావ్‌నగర్ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారులకు నిపుణులైన వైద్యుల పర్యవే క్షణలో ప్రత్యేక వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ఆరుగురు చిన్నారులు కోలుకుని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయినట్లు వివరించారు. చండీపుర వైరస్ నిర్ధారణ అయిన వారంతా 15 ఏళ్లలోపు

మిగతా 2 లో..

## నీట్ పరీక్ష విధానంలో భారీ మార్పులు

- కంప్యూటర్ ఆధారిత పరీక్షకు కేంద్రం సన్నాహాలు
- జేఈఈ తరహాలో రెండు దశల్లో నిర్వహణపై ప్రతిపాదన
- సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించిన కేంద్రం
- తుది నిర్ణయానికి ముందు నిపుణుల కమిటీ సూచనల పరిశీలన

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**

నీట్–యూజీ పరీక్ష నిర్వహణలో పారదర్శకత, భద్రతను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలో పరీక్ష నిర్వహణ విధానాన్ని సమూలంగా మార్చే దిశగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కేంద్రం తన ప్రతిపాదనలను వివరించింది. నీట్ పరీక్ష నిర్వహణలో లోపాలను ప్రశ్నిస్తూ దాఖలైన పలు పిటిషన్లపై




## విశాఖలో పీవీ సింధు క్రీడా కేంద్రానికి భూమిపూజ



- పాల్గొన్న పీవీ సింధు, నారా లోకేష్, క్రీడాశాఖ మంత్రి
- సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్‌కు శ్రీకారం

2

## భారత్–ఉజ్బెకిస్థాన్ రక్షణ సహకారంపై చర్చలు

- తాష్కెంట్ లో ఆరో సంయుక్త కార్యాచరణ బృందం సమావేశం
- శిక్షణ, రక్షణ పరిశ్రమ సహకారంపై చర్చలు
- సామర్థ్య నిర్మాణానికి మరింత ప్రాధాన్యం
- ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యానికి

**తాష్కెంట్, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**

భారత్–ఉజ్బెకిస్థాన్ మధ్య రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఆరో సంయుక్త కార్యాచరణ బృందం సమావేశం బుధవారం ఉజ్బెకిస్థాన్ రాజధాని తాష్కెంట్ లో జరిగింది. ఇరు దేశాల రక్షణ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి సహాధ్యక్షులుగా వ్యవహరించగా, ద్వైపాక్షిక రక్షణ సంబంధాల విస్తరణకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.

మిగతా 2 లో..





## ఇరాన్‌కు ట్రంప్ మరో హెచ్చరిక

- హర్మూజ్ జలసంధి వెంటనే తెరవాలని డిమాండ్
- చర్చల నుంచి వెనక్కి తగ్గితే తీవ్ర పరిణామాల హెచ్చరిక
- అణ్వాయుధాలకు అవకాశం లేదని అమెరికా స్పష్టం
- ప్రకటనలతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

2

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హర్మూజ్ జలసంధిని సాధ్యమైనంత త్వరగా తెరవాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## తెలంగాణ ప్రాజెక్టులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

- సమ్మక్క సాగర్‌కు నెలాఖరులో నిరభ్యంతర పత్రం వస్తుందని వెల్లడి
- కాళేశ్వరం, నీటి హక్కులపై బీఆర్ఎస్‌ను నిలదీసిన మంత్రి



2

## 22ఏ భూములపై అర్హులకు అన్యాయం జరగదు



2

- కొత్తగా ఒక్క సెంటు భూమినీ నిషేధిత జాబితాలో చేర్చలేదన్న మంత్రి
- 22ఏ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశాలు



## రేవంత్ విదేశీ పర్యటనకు కోర్టు అనుమతి

- ఏసీబీ ప్రత్యేక కోర్టు గ్రీన్‌సిగ్నల్
- పలు షరతులతో పాస్‌పోర్ట్ విడుదలకు ఆదేశాలు
- ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు విదేశీ పర్యటన
- ఓటుకు నోటు కేసు విచారణ సుప్రీంకోర్టులో కొనసాగుతోంది

**హైదరాబాద్, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు హైదరా బాద్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు అనుమతి మంజూరు చేసింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితు డిగా ఉన్న రేవంత్ రెడ్డి అధికా రిక విదేశీ పర్యటన నిమిత్తం తన పాస్‌పోర్ట్‌ను తాత్కా లికంగా తిరిగి ఇవ్వాలని, విదేశా లకు వెళ్లేందుకు అనుమతించాలని కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం పలు షరతులు విధిస్తూ విదేశీ పర్యటనకు అనుమతి ఇచ్చింది.

మిగతా 2 లో..

## గుజరాత్ లో చండీపుర వైరస్ కలకలం

చిన్నారులేనని మంత్రి తెలిపారు. ఈ వైరస్ ఒకే గ్రామం లేదా జిల్లాకు పరిమితం కాలేదని, గుజరాత్‌లోని పలు ప్రాంతాల నుంచి కేసులు నమోదవుతున్నాయని వెల్లడించారు. దీంతో వైరస్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు వైద్య, ఆరోగ్య శాఖ బృందాలు క్షేత్రస్థాయిలో నిఘా పెంచాయని, దోమలు, ఇసుక ఈగల నివారణ కోసం విస్తృతంగా పురుగుమందులు పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మి భయాందోళనలకు గురికావద్దని ఆరోగ్య శాఖ సూచించింది. పిల్లల్లో అధిక జ్వరం, వాంతులు, మూర్ఛ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీప ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ప్రారంభ దశలోనే వైద్య చికిత్స అందితే ప్రాణాపాయం తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. చండీపుర ఎన్సెఫలైటిస్ ఒక అరుదైన వైరల్ వ్యాధి. ఇది ప్రధానంగా ఇసుక ఈగల ద్వారా వ్యాపించి మెదడులో వాపుకు కారణమవుతుంది. ఈ వైరస్‌ను 1965లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా చండీపుర గ్రామంలో తొలిసారిగా గుర్తించారు. ముఖ్యంగా 15 ఏళ్లలోపు పిల్లలపై ఈ వైరస్ తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. సకాలంలో చికిత్స అందకపోతే పరిస్థితి వేగంగా విషమించే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం చండీపుర వైరస్‌కు ప్రత్యేక టీకా లేదా నిర్దిష్ట యాంటీవైరల్ ఔషధం అందుబాటులో లేదు. అందువల్ల లక్షణాలను బట్టి సహాయక చికిత్సే ప్రధాన మార్గంగా వైద్యులు పేర్కొంటున్నారు. వైరస్ వ్యాప్తిని నియంత్రించేందుకు పరిసరాల పరిశుభ్రత, ఇసుక ఈగల నియంత్రణ, పిల్లలను కీటకాల కాట్ల నుంచి రక్షించడం, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య శాఖ ప్రజలకు సూచించింది.

## 22ఏ భూములపై అర్హులకు అన్యాయం జరగదు

**హైదరాబాద్, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఒక్క అర్హుడికీ అన్యాయం జరగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార–పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన భూహక్కుదారుల హక్కులను పరిరక్షిస్తూనే ప్రభుత్వ భూములను కాపాడటం అనే ద్వంద్వ లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులకు ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవహరించడం లేదని, వివాదాలు లేని ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో చేర్చారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలోని 22ఏ భూములకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి ఆలోచనలను అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను చట్టబద్ధంగా పరిశీలించి, అర్హత ఉన్న భూములను గుర్తించి ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేసును భూ రికార్డులు, చట్టపరమైన అంశాలు, వాస్తవాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులను తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను కూడా ప్రత్యేకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. హైకోర్టు నిర్దేశించిన 45 రోజుల గడువులోనే వివాదాలకు సంబంధించిన అన్ని ప్రక్రియలు పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై అక్రమ రిజిస్ట్రేషన్లు, అక్రమ లావాదేవీలు, ఆక్రమణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజల హక్కులు, ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్–మల్కాజిగిరి అదనపు కలెక్టర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## విశాఖలో పీవీ సింధు క్రీడా కేంద్రానికి భూమిపూజ

**విశాఖపట్నం, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**

విశాఖపట్నం అరిలోవ ప్రాంతంలోని తోటగరువులో భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్య, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, పీవీ సింధు పాల్గొన్నారు. కార్యక్రమానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు పీవీ సింధు, ఆమె కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి క్రీడా కేంద్ర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా క్రీడా రంగ అభివృద్ధిపై చర్చించిన నాయకులు, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణా కేంద్రాలు ఏర్పాటైతే రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. ఆధునిక సౌకర్యాలతో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు తెలిపారు. ఈ క్రీడా కేంద్రం ద్వారా బ్యాడ్మింటన్‌తో పాటు ఇతర క్రీడల్లో కూడా ప్రతిభ కలిగిన యువతకు నాణ్యమైన శిక్షణ, ఆధునిక మౌలిక వసతులు, అంతర్జాతీయ స్థాయి కోచింగ్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తూ యువత ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు తెలిపారు. ప్రపంచస్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో మరిన్ని మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, శాప్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. భరణి, గ్రీన్‌కో ఎనర్జీ ఎఫిషియన్సీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ చలమలశెట్టి స్వాతితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఇరాన్‌కు ట్రంప్ మరో హెచ్చరిక

**వాషింగ్టన్, ఆగస్టు 05 (నవజ్యోతి ప్రతినిధి):**

ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా సాగుతున్నప్పటికీ, వాటిని బహిరంగంగా ఖండించడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలను పెంచుతున్నాయి. ఇరాన్ చర్చల ప్రక్రియ నుంచి వెనక్కి తగ్గితే పరిణామాలు అత్యంత తీవ్రంగా ఉంటాయని ట్రంప్ హెచ్చరించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతిపెద్ద సైనిక చర్యకు అమెరికా సిద్ధమవుతున్న సమయంలో ఇరాన్ తమను సంప్రదించి చర్చలకు రావాలని కోరిందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై మరో 48 గంటల్లో స్పష్టత వస్తుందని వెల్లడించారు. టెహ్రాన్ అణ్వాయుధాలను కలిగి ఉండేందుకు అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోదని ట్రంప్ పునరుద్ఘాటించారు. ప్రపంచ భద్రత, ప్రాంతీయ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైతే కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడబోమని తెలిపారు. ఇరాన్ అణు కార్యక్రమాలపై అమెరికా ఎప్పటికప్పుడు నిఘా కొనసాగిస్తోందని కూడా పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రాకపోకల అంశంపై ఇరాన్, ఒమన్‌తో కలిసి చర్చలు జరుగుతున్నాయని అమెరికా వెల్లడించింది. ఒకటి లేదా రెండు రోజుల్లో ఈ అంశంపై ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. ప్రపంచ చమురు రవాణాలో హర్మూజ్ జలసంధికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ఈ చర్చలు కీలకంగా మారాయి. అయితే అమెరికా చేసిన ఈ ప్రకటనలను ఇరాన్ ఖండించింది. ఒమన్‌తో జరుగుతున్న చర్చల్లో అమెరికాకు ఎలాంటి పాత్ర లేదని స్పష్టం చేసింది. తమ సార్వభౌమాధికారం, జాతీయ భద్రతను పరిరక్షించే కొత్త సముద్ర రవాణా విధానంపై మాత్రమే ఒమన్‌తో చర్చలు సాగుతున్నాయని ఇరాన్ పేర్కొంది. అమెరికా చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని తెలిపింది. ట్రంప్ తాజా హెచ్చరికలు, ఇరాన్ ప్రతిస్పందనతో పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. హర్మూజ్ జలసంధి చుట్టూ నెలకొన్న పరిస్థితులను ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. రాబోయే రోజుల్లో అమెరికా, ఇరాన్ వైఖరులు ఏ దిశగా సాగుతాయన్నదానిపై అంతర్జాతీయ సమాజం దృష్టి సారించింది.

## భారత్-ఉజ్బెకిస్థాన్ రక్షణ సహకారంపై చర్చలు

**మొదటిపేజీ తరువాయి**

భారత్ తరఫున సంయుక్త కార్యదర్శి దినేష్ కుమార్, ఉజ్బెకిస్థాన్ తరఫున ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ అంతర్జాతీయ సైనిక సహకార విభాగం అధిపతి లెఫ్టినెంట్ కల్నల్ సుఖ్రోబ్ జోన్ సోదిక్ జోనోవిచ్ సిరోజోవ్ సమావేశానికి నాయకత్వం వహించారు. ఉమ్మడి సైనిక విన్యాసాలు, శిక్షణ కార్యక్రమాలు, సామర్థ్యాభివృద్ధి, రక్షణ విద్య, రక్షణ పరిశ్రమల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించడంపై ఇరు పక్షాలు సమగ్రంగా చర్చించాయి. సైనిక శిక్షణలో నైపుణ్యాల మార్పిడి, రక్షణ రంగంలో సాంకేతిక సహకారం, విద్యా సంస్థల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. భవిష్యత్తులో పరస్పర శిక్షణ కార్యక్రమాలను పెంచడంతో పాటు ఇరు దేశాల రక్షణ వ్యవస్థల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపర్చేందుకు కార్యాచరణ రూపొందించాలనే అభిప్రాయానికి వచ్చారు. సమావేశం అనంతరం భారత ప్రతినిధి బృందం ఉజ్బెకిస్థాన్ లోని మిలిటరీ సెక్యూరిటీ అండ్ డిఫెన్స్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. అక్కడ భారత్ చేపడుతున్న సామర్థ్య నిర్మాణ కార్యక్రమాల పురోగతిని సమీక్షించింది. సైనిక విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కొనసాగుతున్న సహకార కార్యక్రమాలను అధికారులు పరిశీలించారు. భారత్–ఉజ్బెకిస్థాన్ మధ్య రక్షణ రంగంలో గత కొన్నేళ్లుగా సహకారం క్రమంగా విస్తరిస్తోందని అధికారులు పేర్కొన్నారు. ఉమ్మడి శిక్షణలు, పరస్పర సందర్శనలు, రక్షణ విద్య, సాంకేతిక భాగస్వామ్యం వంటి అంశాలు ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తున్నాయని వెల్లడించారు. ఈ సమావేశం ద్వారా ఆ సహకారం మరో ముందడుగు వేసిందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలపరిచే దిశగా కీలకంగా నిలిచింది. భవిష్యత్తులో రక్షణ రంగంలో మరింత సమగ్ర సహకారం, సాంకేతిక మార్పిడి, సంయుక్త శిక్షణ కార్యక్రమాలను విస్తరించేందుకు ఇరు దేశాలు తమ నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించాయి.

## నీట్ పరీక్ష విధానంలో భారీ మార్పులు

**మొదటిపేజీ తరువాయి**

ఆగస్టు 6న సుప్రీంకోర్టు విచారణ చేపట్టనున్న నేపథ్యంలో ఈ అఫిడవిట్ దాఖలైంది. కేంద్రం ప్రతిపాదన ప్రకారం భవిష్యత్తులో నీట్-యూజీ పరీక్షను సంప్రదాయ పెన్-పేపర్ విధానంలో కాకుండా పూర్తిగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించే అవకాశాన్ని పరిశీలిస్తోంది. ఇప్పటికే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పలు ప్రధాన ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో విజయవంతంగా నిర్వహిస్తున్నందున, అదే నమూనాను నీట్‌కు కూడా విస్తరించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిపింది. అలాగే జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్ తరహాలో నీట్ పరీక్షను కూడా రెండు దశల్లో నిర్వహించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. రెండు దశల పరీక్ష ద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని మరింత సమర్థవంతంగా అంచనా వేయడంతో పాటు ప్రశ్నాపత్రం లీకేజీ, అవకతవకలు, మాల్‌ప్రాక్టీస్ వంటి సమస్యలకు అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొంది. దీంతో పరీక్ష నిర్వహణ మరింత భద్రంగా, విశ్వసనీయంగా మారుతుందని కేంద్రం అభిప్రాయపడింది. అయితే ఈ ప్రతిపాదనలపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని కేంద్రం స్పష్టం చేసింది. పరీక్షా విధానంలో సమగ్ర సంస్కరణల కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ కమిటీ నివేదిక, నిపుణుల సూచనలు, విద్యార్థులు, విద్యా నిపుణుల అభిప్రాయాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగం, భద్రతా ప్రమాణాలు, పారదర్శకత, మూల్యాంకన విధానాలపై సమగ్ర సూచనలు అందించనుంది. ఈ సిఫార్సుల ఆధారంగానే భవిష్యత్ పరీక్షా విధానాన్ని ఖరారు చేస్తామని కేంద్రం వెల్లడించింది. విద్యార్థులపై ఎలాంటి భారం పడకుండా, ఎలాంటి మార్పునైనా ముందస్తు సమాచారం ఇచ్చి అమలు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. పరీక్షా విధానంలో మార్పులను ఏకపక్షంగా అమలు చేయబోమని, విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించి, కొత్త విధానానికి అనుగుణంగా సిద్ధం అయ్యేలా తగిన సమయం కల్పిస్తామని స్పష్టం చేసింది.

## తెలంగాణ ప్రాజెక్టులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

**హైదరాబాద్, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కట్టుకథలు అల్లుతూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడే విషయంలో ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా ప్రతి జలమండలి సమావేశంలో తెలంగాణ ప్రాజెక్టులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇది కొత్త విషయం కాదని, అలాంటి అభ్యంతరాలను సమర్థవంతంగా తిప్పికొడుతూ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతున్నామని చెప్పారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి టెక్నికల్ అడ్వైజరీ కమిటీ అనుమతులు సాధించడం ద్వారా తమ ప్రభుత్వ నిబద్ధతను నిరూపించామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకం, పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయని మంత్రి గుర్తు చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం కూడా అప్పుడే పూర్తయిందని పేర్కొన్నారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తెలంగాణ నీటి హక్కులను కాపాడడంలో బీఆర్ఎస్ విఫలమైందని ఆరోపించారు. ఇప్పుడు అధికారాన్ని కోల్పోయాక మొసలి కన్నీరు కారుస్తూ విమర్శలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో పలుమార్లు చర్చలు జరిపినట్లు ఉత్తమ్ వెల్లడించారు. ఇప్పటికే మూడు సార్లు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేశామని, ఈ నెలాఖరులో ఎన్‌ఓసీ ఇస్తామని అక్కడి ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారి కూడా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో ఇలాంటి ప్రయత్నం చేశారా అని ప్రశ్నించారు. నిర్వహించి తెలంగాణ అభ్యంతరాలను బలంగా వినిపించిందని మంత్రి తెలిపారు.

## రేవంత్ విదేశీ పర్యటనకు కోర్టు అనుమతి

**మొదటిపేజీ తరువాయి**

కోర్టు ఆదేశాల ప్రకారం రేవంత్ రెడ్డి ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో అధికారికంగా పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన సమర్పించిన పిటిషన్‌ను పరిశీలించిన ఏసీబీ ప్రత్యేక కోర్టు రూ.1 లక్ష వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఒకరి హామీ సమర్పించాలని ఆదేశించింది. అలాగే పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రణాళిక, ఆయా దేశాల్లో బస చేసే చిరునామాలు, ప్రయాణ వివరాలను కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. విదేశీ పర్యటనకు ముందు కేంద్ర విదేశాంగ శాఖ నుంచి అవసరమైన రాజకీయపరమైన అనుమతులు పొందాలని కూడా కోర్టు షరతు విధించింది. పర్యటన ముగించుకుని భారత్‌కు తిరిగి వచ్చిన అనంతరం 2026 సెప్టెంబర్ 18లోగా తన పాస్‌పోర్ట్‌ను మళ్లీ కోర్టులో జమ చేయాలని న్యాయస్థానం ఆదేశాల్లో పేర్కొంది. ఈ షరతులను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. 2015లో నమోదైన ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి మొదటి నిందితుడిగా ఉన్నారు. అప్పట్లో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయాలని నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు రూ.50 లక్షల లంచం ఇవ్వడానికి ప్రయత్నించారనే ఆరోపణలపై 2015 మే 31న ఏసీబీ అధికారులు ఆయనను అరెస్ట్ చేశారు. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో దాదాపు నెల రోజుల పాటు జైలులో ఉన్న రేవంత్ రెడ్డికి అనంతరం హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ షరతుల్లో భాగంగా ఆయన తన పాస్‌పోర్ట్‌ను కోర్టులో జమ చేయాలని, విదేశాలకు వెళ్లాల్సి వస్తే ముందుగా ఏసీబీ ప్రత్యేక కోర్టు అనుమతి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. అప్పటి నుంచి విదేశీ పర్యటనల కోసం ప్రతిసారి కోర్టును ఆశ్రయిస్తున్నారు. ఏసీబీ అధికారులు అభియోగపత్రం దాఖలు చేశారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణలో ఉంది.

## సమ్మక్క సాగర్ ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

**హైదరాబాద్, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**

సమ్మక్క–సారక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన అంశంపై తెలంగాణ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని మాజీ మంత్రి, అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ప్రశ్నలు సంధించారు. ప్రాజెక్టుకు సంబంధించి వస్తున్న వార్తలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల మధ్య జరిగిన సమావేశంలో గోదావరి జలాల అంశంపై ఎలాంటి చర్చ జరిగిందని హరీశ్ రావు ప్రశ్నించారు. ఆ సమావేశంలో తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారో వెల్లడించాలని కోరారు. 47 టీఎంసీల సామర్థ్యంతో ప్రతిపాదించిన సమ్మక్క–సారక్క సాగర్ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసం వదులుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అంగీకరించిందంటూ వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ వార్తల్లో వాస్తవం ఉందా లేదా అన్న విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు, నీటి హక్కుల విషయంలో ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని హరీశ్ రావు అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలు తీసుకుంటే ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని పేర్కొన్నారు. నీటి హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతి నిర్ణయం ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. అయితే హరీశ్ రావు చేసిన ఈ ఆరోపణలు, ప్రశ్నలపై తెలంగాణ ప్రభుత్వం నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

## పొగాకు రైతుల అంశంపై బహిరంగ చర్చకు సవాల్

**అమరావతి, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**

పొగాకు రైతుల సంక్షేమంపై వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బర్లీ పొగాకు రైతుల నుంచి 25 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేసి సుమారు రూ.280 కోట్లు చెల్లించామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అలాగే 2014–15లో ఎఫ్‌సీవీ పొగాకు ధరలు తగ్గిన సమయంలో రైతులకు ప్రతి కిలోకు రూ.20 చొప్పున ఆర్థిక సహాయం అందించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని చెప్పారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 2019లో 124 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి జరిగినప్పటికీ కేవలం 11.8 మిలియన్ కిలోలు మాత్రమే కొనుగోలు చేశారని ఆరోపించారు. అనంతరం ఏడాది 128 మిలియన్ కిలోల ఉత్పత్తి వచ్చినప్పటికీ ఒక్క కిలో కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. పొగాకు ధరల విషయాన్ని ప్రస్తావిస్తూ 2019లో కిలో ధర రూ.142 ఉండగా, కూటమి ప్రభుత్వ హయాంలో 2024లో రూ.326, 2025లో రూ.300, 2026లో రూ.275గా నమోదైనట్లు తెలిపారు. ఈ ఏడాది టొబాకో బోర్డు లక్ష్యం 131 మిలియన్ కిలోలు కాగా, రైతులు 241 మిలియన్ కిలోల ఉత్పత్తి చేశారని పేర్కొన్నారు. మొత్తం రూ.100 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించిందని చెప్పారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ

- **జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆధ్వర్యంలో భిక్కనూరులో అవగాహన సదస్సు..**

**భిక్కనూరు, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**





సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం భిక్కనూరులోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సైబర్ మోసాల నుంచి ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలి, మోసగాళ్ల వలలో పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. సభకు హాజరైన వారితో సైబర్ భద్రతపై ప్రతిజ్ఞ కూడా చేయించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, ప్రస్తుతం దొంగలు ఇళ్లలోకి చొరబడి దోచుకోవడం కంటే ఫోన్ కాల్స్, నకిలీ లింకులు, ఓటీపీలు, క్యూ ఆర్ కోడ్‌లు, సోషల్ మీడియా ద్వారా క్షణాల్లో ప్రజల బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును దోచుకుంటున్నారని తెలిపారు. అపరిచితుల ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని, వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని సూచించారు. అనుమానాస్పద కాల్స్, లింకులు, యాప్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ, సైబర్ నేరాలు రోజురోజుకు కొత్త రూపాలు దాల్చుతున్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా సైబర్ భద్రతపై అవగాహన చాలా అవసరమని, ఈ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులకు, గ్రామ ప్రజలకు తెలియజేయాలని కోరారు. పోలీసు శాఖ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలకు ప్రజలు సహకరించి సైబర్ మోసాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐ జగడం నరేష్, ఎస్ఐ ఎస్. అనిల్, పోలీసు సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, మండలంలోని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది, పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభ అనంతరం సైబర్ నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు.

# విద్యుత్ శాఖ ఆస్తులపై దొంగల దండయాత్ర..!

- **ట్రాన్స్‌ఫార్మర్ల తర్వాత బోరు మోటర్ల కేబుళ్లే లక్ష్యం.. వరుస చోరీలతో రైతుల్లో ఆందోళన...**

**భిక్కనూరు, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**





కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలో విద్యుత్ శాఖ ఆస్తులను లక్ష్యంగా చేసుకుని దొంగలు వరుస చోరీలకు పాల్పడుతుండటం రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే గుజ్జకుంట, బస్వాపూర్, పెద్ద మల్లారెడ్డి గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైన ఘటనలు కలకలం రేపగా, తాజాగా రామేశ్వర్‌పల్లి గ్రామంలో బోరు మోటర్ల విద్యుత్ కేబుళ్లను కత్తిరించి దుండగులు ఎత్తుకెళ్లారు. గ్రామంలోని సామల రాజిరెడ్డి బావి నుంచి ఏనుగు భూపతి బావి వరకు ఉన్న 14 బోరు మోటర్ల విద్యుత్ కేబుళ్లను రాత్రి వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించి చోరీ చేసినట్లు రైతులు తెలిపారు. దీంతో సాగునీటి సరఫరా నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో వరుసగా విద్యుత్ శాఖ ఆస్తులపై దాడులు జరుగుతుండటంతో రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల తర్వాత ఇప్పుడు బోరు మోటర్ల కేబుళ్లను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళనకరంగా మారిందని పేర్కొంటున్నారు. ఈ చోరీల వల్ల విద్యుత్ శాఖకు ఆర్థిక నష్టం వాటిల్లడమే కాకుండా, వ్యవసాయ పనులు కూడా తీవ్రంగా దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో వ్యవసాయ క్షేత్రాల వద్ద పోలీసు గస్తీ పెంచడంతో పాటు విద్యుత్ శాఖ తమ ఆస్తుల భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. చోరీలకు పాల్పడుతున్న దుండగులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించి రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల అప్రమత్తత, పోలీసుల నిఘా, విద్యుత్ శాఖ సమన్వయంతోనే ఇలాంటి వరుస చోరీలకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# గ్రామ సమస్యలపై షబ్బీర్ అలీతో వరుస భేటీలు

- **రామేశ్వర్‌పల్లి సమస్యలు.. బస్వాపూర్ సహకార సంఘం విభజనపై వినతులు..**

**హైదరాబాద్, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**



కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలానికి చెందిన పలు గ్రామాల ప్రజా సమస్యలు, బస్వాపూర్ సహకార సంఘం విభజన అంశంపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అలీని బుధవారం హైదరాబాద్‌లో పలువురు కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. మొదట భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు షబ్బీర్ అలీని కలిసి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం బస్వాపూర్ సహకార సంఘం విభజన అంశంపై బస్వాపూర్ సర్పంచ్ తుడుం పద్మ స్వామి, గుర్జకుంట సర్పంచ్ సంతోష్, రాగ్యట్లపల్లి సర్పంచ్ నీలంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాగారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు తుడుం ప్రదీప్ తదితరులు షబ్బీర్ అలీతో సమావేశమయ్యారు. సహకార సంఘం విభజన సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు సంబంధించిన ఇతర ప్రజా సమస్యలను కూడా నాయకులు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లగా, వాటిపై కూడా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రామేశ్వర్‌పల్లి గ్రామ ప్రతినిధుల బృందంలో రాజేందర్, శశికుమార్, కొండల్ రెడ్డి, రాకేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ రెడ్డి, రమేష్ రెడ్డి, సూర్యకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బస్వాపూర్ సహకార సంఘం ప్రతినిధుల బృందంలో బస్వాపూర్ సర్పంచ్ తుడుం పద్మ స్వామి, గుర్జకుంట సర్పంచ్ సంతోష్, రాగ్యట్లపల్లి సర్పంచ్ నీలంరెడ్డి, బాగారెడ్డి, తుడుం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి ఆటోలు, క్యాబ్‌ల బంద్!

**హైదరాబాద్, ఆగస్టు 05 (నవజ్యోతి బ్యూరో చీఫ్ పి రాజగోపాల్) :**

తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల ఆగస్టు 23వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆటోలు, క్యాబ్‌ల బంద్‌ను నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ ప్రకటించింది. ఈ సమ్మెకు సంబంధించిన నోటీసును వచ్చే శనివారం రవాణా శాఖ కమిషనర్‌కు అందజేయనున్నట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు.



**జేఏసీ ప్రధాన డిమాండ్లు ఇవే:**

ఈవీ ఆటోల ఉపసంహరణ: ఆర్టీసీ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ ఆటోలను తీసుకురావాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి. ఆర్థిక సాయం: ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలి. క్షేమ బోర్డు ఏర్పాటు: ఆటో కార్మికుల రక్షణ, సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి. సింగిల్ పర్మిట్: రాష్ట్రవ్యాప్తంగా ఆటోలన్నింటికీ ఒకే పర్మిట్ సింగిల్ పర్మిట్ విధానాన్ని అమలు చేయాలి. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఆగస్టు 23 నుంచి సమ్మెను తీవ్రతరం చేస్తామని జేఏసీ స్పష్టం చేసింది.

# రంగధాముని చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే

**హైదరాబాద్, ఆగష్టు 05 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి రాజగోపాల్) :**



రంగధాముని చెరువు అభివృద్ధి మరియు రాబోయే పండుగల ఏర్పాట్లపై స్థానిక ఎమ్మెల్యే, హైడ్రా కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని రంగధాముని చెరువును ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్ కలిసి ఈరోజు సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. త్వరలో రానున్న బతుకమ్మ, వినాయక చవితి పండుగల సందర్భంగా చెరువు వద్ద జరిగే నిమజ్జనాలు, వేడుకలకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. చెరువు అభివృద్ధి పనులతో పాటు, వాటర్ వర్క్స్ మరియు విద్యుత్ శాఖలకు 10 ఎకరాల భూమిని కేటాయించాలని ఆయన కోరారు. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన చర్యలు త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు.

## నారాయణ స్కూల్ 9, 10 తరగతులకు అనుమతులు లేవు:ఎంఈవో హెచ్చరిక

**గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని సూచన..**

**కామారెడ్డి, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**



కామారెడ్డి పట్టణంలోని నారాయణ స్కూల్‌లో 9, 10 తరగతుల నిర్వహణకు ప్రభుత్వ అనుమతులు లేవని మండల విద్యాధికారి ఎల్లయ్య తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు తల్లిదండ్రులకు అవగాహన కల్పించినప్పటికీ కొందరు విద్యార్థులను అదే పాఠశాలలో కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనుమతులు లేని పాఠశాలల్లో విద్యార్థులను కొనసాగించడం వల్ల భవిష్యత్తులో తలెత్తే పరిణామాలకు విద్యాశాఖ బాధ్యత వహించదని ఎంఈవో ఎల్లయ్య హెచ్చరించారు.

## అర్హుల కోసం సీఎం కాళ్లు పట్టుకునేందుకైనా సిద్ధం:

**బీఆర్ ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**కూకట్ పల్లి, ఆగస్టు 05 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టీ రాజగోపాల్) :**

కైతలాపూర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన స్థానిక పేదలకు కేటాయించే విషయంలో తాను ఎంతటి త్యాగానికైనా సిద్ధమని కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళ్లు పట్టుకునేందుకైనా తాను వెనకాడనని ఆయన వ్యాఖ్యానించారు. కైతలాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించిన సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. ప్రజల సమస్యలపై, హక్కులపై తాము ప్రశ్నిస్తే.. ప్రభుత్వం తమపై విచారణలు చేపట్టి భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని మండిపడ్డారు. ఇలాంటి విచారణలకు తాము భయపడే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. అర్హులైన స్థానికులకు ఇళ్లు ఇవ్వకపోతే రాబోయే రోజుల్లో ప్రభుత్వం తీవ్ర ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## అభివృద్ధి సమన్వయంతో పని చేయాలి ఎమ్మెల్యే



**శివంపేట, ఆగస్టు 5 నవజ్యోతి ప్రతినిధి (ఆకుల శ్రీనివాస్)**

శివంపేట మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, సర్పంచులతో సమావేశమై పలు సమస్యలపై చర్చించారు గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మి, తాసిల్దార్ కమలాద్రి తదితరులు పాల్గొన్నారు.

## జైల్ భరోను విజయవంతం చేయాలి



**శివంపేట ఆగస్టు 5 నవజ్యోతి ప్రతినిధి ఆకుల శ్రీనివాస్**

శివంపేట్ మండలంలో ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు గోపమ్మ పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నిరసనలు చేపడతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆరోపిస్తూ కార్మిక కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల, స్వప్న, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం

**రామాయంపేట, ఆగస్టు 5 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం వెంకటాపూర్ (ఆర్) గ్రామానికి చెందిన రాచపల్లి బాబు అనారోగ్యంతో మంగళవారం మృతిచెందిన విషయం తెలిసి గ్రామానికి చెందిన ప్రముఖ సంఘసేవకుడు వెంకుగారి రాజిరెడ్డి బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ తన వంతు బాధ్యతగా రూ.5,000 నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.కష్టకాలంలో కుటుంబానికి తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని రాజిరెడ్డి పేర్కొన్నారు. ఆయన అందించిన ఆర్థిక సాయం పట్ల మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## సమాజాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు యువత ముందుండాలి



**నడిగూడెం, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**

మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, సమాజాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు యువత ముందుండాలని నడిగూడెం ఎస్సై తేజస్విని పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని కె.ఎల్.ఎన్. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణ, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసకావడం వల్ల మరియు సైబర్ నేరాల బారిన పడటం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రదర్శించిన అవగాహన వీడియోలు విద్యార్థులను ఎంతగానో ఆలోజింపజేశాయి. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో 'యాంటీ డ్రగ్స్' పోస్టర్లను ఆవిష్కరించారు.తొలిసారిగా కళాశాలకు విచ్చేసిన నూతన ఎస్సై తేజస్వినిని కళాశాల ప్రిన్సిపాల్ డి. విజయ్ నాయక్, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జాన్ పాషా, శ్రీధర్, కృష్ణ, మహేష్, స్టూడెంట్ కౌన్సిలర్ కొల్లు శ్రీనివాస్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## టీడబ్ల్యూజేఎఫ్ పటాన్ చెరు నియోజకవర్గ మహాసభను విజయవంతం చేయాలి

- అధ్యక్షుడు బాదిని శ్రీను,
- ప్రధాన కార్యదర్శి కొత్తకొండ సత్యం పిలుపు

**పటాన్ చెరు, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి) :**





తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) పటాన్చెరు నియోజకవర్గ మహాసభను జర్నలిస్టులందరూ ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని టీడ జేఎఫ్ పటాన్చెరు నియోజకవర్గ అధ్యక్షుడు బాదిని శ్రీను, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ సత్యం పిలుపునిచ్చారు. పటాన్ చెరులోని ఐబీ గెస్ట్ హౌస్‌లో గురువారం నిర్వహించనున్న ఈ మహాసభకు నియోజకవర్గ పరిధిలోని వర్కింగ్ జర్నలిస్టులు,మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ మహాసభకు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర, జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, బాధ్యులు హాజరుకానున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సంఘం బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు. అందువల్ల నియోజకవర్గంలోని ప్రతి జర్నలిస్టు ఈ మహాసభకు తప్పనిసరిగా హాజరై సంఘ ఐక్యతను చాటాలని అధ్యక్షుడు బాదిని శ్రీను, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ సత్యం విజ్ఞప్తి చేశారు.

## కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులకు ఘన సన్మానం

**నడిగూడెం, ఆగస్టు 05 (నవజ్యోతి ప్రతినిధి):**



కల్లు గీత కార్మికుల హక్కుల రక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా అవిశ్రాంతంగా పోరాడుతున్న నాయకులకు సన్మానం జరిగింది.నడిగూడెం మండలం రత్నవరం గ్రామంలో బీసీ హక్కుల సాధన సమితి కోదాడ నియోజకవర్గ అధ్యక్షురాలు మండవ నాగమణి నేతృత్వంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి. రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మండవ నాగమణి మాట్లాడుతూ.. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా నిధులను వెంటనే విడుదల చేయాలి. ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల భార్యలకు నెలవారీ పింఛన్ సదుపాయం కల్పించాలి. యాభై ఏళ్లు నిండిన గీత కార్మికులకు నెలకు నాలుగు వేల పింఛన్ అందించాలి. గ్రామ, మండల కేంద్రాల్లో తాటి, ఈత వనాల పెంపకం కోసం 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తామని ఎన్నికల వేళ ఇచ్చిన హామీని నెరవేర్చాలి.అన్ని జిల్లా కేంద్రాల్లో 'నీరా' సేకరణ, అమ్మకపు కేంద్రాలను ఏర్పాటు చేసి కార్మికులకు జీవిత భద్రత, ఆర్థిక భరోసా కల్పించాలి.గీత కార్మికులు చైతన్యవంతులై ఐక్యంగా ముందుకెళ్లాలని, సామాజిక బాధ్యతను గుర్తిస్తూ ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా సమాజంలో ప్రత్యేక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా నాగమణి పిలుపునిచ్చారు.

## అంగన్వాడి కేంద్రానికి స్థలం కేటాయించాలని వినతి పత్రం అందజేత.

**వాజేడు, నవజ్యోతి ప్రతినిధి :**

. వాజేడు మండలంలోని మొరుమూరు గ్రామపంచాయతీ పరిధిలో గల ఘనపురం కాలనీ గ్రామంలో అంగన్వాడి కేంద్రానికి స్థలం లేక, వేరే ఊరు అంగన్వాడి కేంద్రానికి పిల్లలని పంపించలేక పిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందికి గురౌతున్నారు. పక్కా అంగన్వాడి భవనం మంజూరు అయినప్పటికీ సరైన స్థలం లేక భవనం నిర్మించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.చేసేది ఏమిలేక గ్రామానికి ఎదురుగా ఉన్న అటవీ శాఖకు సంబంధిన భూమిలో అంగన్వాడి కేద్రం పక్కా భవనం నిర్మించుకొనుటకు స్థలం కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, భద్రాచల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య కు వినతిపత్రం అందజేశారు. ఈయొక్క కార్యక్రమంలో ములుగు జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి, చిచ్చడి రాఘవులు, వాజేడు మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు అట్టం రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా న్యాయస్థానమా?

- తీర్పులు వైరల్... న్యాయం ఎక్కడ?
- ప్రజల కోర్టుగా మారిన సోషల్ మీడియా !



**ఒకప్పుడు ఏదైనా ఘటన జరిగితే ప్రజలు పోలీసులు, దర్యాప్తు సంస్థలు, కోర్టుల వైపు చూసేవారు. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఒక వీడియో, ఒక ఫోటో, ఒక ట్వీట్ లేదా ఒక పోస్టు సోషల్ మీడియాలో కనిపించగానే లక్షలాది మంది క్షణాల్లోనే తీర్పు చెప్పేస్తున్నారు. విచారణ పూర్తికాకముందే నిందితుడిగా ముద్ర వేస్తున్నారు. కొన్నిసార్లు బాధితుడినే దోషిగా చిత్రీకరిస్తున్నారు. తర్వాత అసలు నిజాలు బయటకు వచ్చినా అప్పటికే ఒక వ్యక్తి పరువు, కుటుంబం, ఉద్యోగం, సామాజిక జీవితం తీవ్రంగా దెబ్బతింటాయి. సోషల్ మీడియా ప్రజలకు గొంతుకను ఇచ్చింది. కానీ అదే గొంతుక ఇప్పుడు న్యాయస్థానాన్ని మించిపోయి తీర్పులు చెప్పే స్థాయికి చేరుకోవడం ప్రజాస్వామ్యానికి, న్యాయవ్యవస్థకు ఆందోళన కలిగించే పరిణామం.**

### ఆధారాల కంటే అభిప్రాయాలకే విలువ

న్యాయస్థానంలో ఒక కేసు విచారణ జరగాలంటే సాక్ష్యాలు, ఆధారాలు, చట్టపరమైన వాదనలు, సాక్షుల వాంగ్మూలాలు, న్యాయసూత్రాలు అన్నీ పరిశీలిస్తారు. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఒక చిన్న వీడియో క్లిప్, కత్తిరించిన ఫోటో, నిర్ధారణ లేని సమాచారం లేదా ఎవరో రాసిన పోస్టే పూర్తి సత్యంగా ప్రచారం అవుతోంది. కోట్లాది మంది అది నిజమా కాదా అని పరిశీలించకుండా షేర్ చేస్తున్నారు. ఫలితంగా నిజం కంటే వైరల్ అయిన సమాచారమే ఎక్కువ మందికి చేరుతోంది. ఇదే అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి.

### మీడియా ట్రయల్ పెరుగుతున్న ముప్పు

ఇటీవలి కాలంలో మీడియా ట్రయల్ అనే పదం తరచూ వినిపిస్తోంది. కొన్ని టెలివిజన్ చానళ్లు, డిజిటల్ ప్లాట్‌ఫార్ములు కూడా సోషల్ మీడియా ఒత్తిడికి లోనై విచారణ పూర్తికాకముందే ప్రత్యేక చర్చలు నిర్వహిస్తూ, అనుమానితులను నేరస్తులుగా చూపిస్తూ కథనాలు ప్రసారం చేస్తున్నాయి. దీనివల్ల ప్రజల్లో ముందుగానే ఒక అభిప్రాయం ఏర్పడుతోంది. తర్వాత కోర్టు నిర్దోషిగా ప్రకటించినా సమాజం మాత్రం అతడిని అంగీకరించడానికి సిద్ధంగా ఉండడం లేదు. ఇది న్యాయవ్యవస్థపై కూడా పరోక్ష ఒత్తిడిని సృష్టించే ప్రమాదం ఉంది.

### ఫేక్ న్యూస్ వేగం.. నిజం వెనుకబాటు

ఫేక్ న్యూస్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పెద్ద సవాలుగా మారింది. పాత వీడియోలను కొత్త ఘటనలతో ముడిపెట్టడం, వేరే దేశంలోని ఫోటోలను స్థానిక సంఘటనలుగా ప్రచారం చేయడం, కృత్రిమ మేధస్సు సహాయంతో నకిలీ చిత్రాలు, వీడియోలు తయారు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడం రోజురోజుకూ పెరుగుతోంది. ఒక అబద్ధం కొన్ని నిమిషాల్లో లక్షల మందికి చేరుతుంది. కానీ అదే అబద్ధాన్ని ఖండించే నిజం అంత వేగంగా ప్రజలకు చేరదు. అందుకే ఫేక్ న్యూస్ సమాజంలో అపోహలు, ద్వేషం, ఉద్రిక్తతలకు కారణమవుతోంది.

### ట్రోలింగ్ అనే సామాజిక శిక్ష

సోషల్ మీడియాలో ట్రోలింగ్ కూడా కొత్త తరహా శిక్షగా మారింది. ఒక అభిప్రాయం నచ్చకపోయినా, ఒక పోస్టు భిన్నంగా ఉన్నా వ్యక్తిగత దూషణలు, అసభ్య వ్యాఖ్యలు, కుటుంబ సభ్యులపై విమర్శలు, మార్ఫింగ్ చిత్రాలు, బెదిరింపులు సాధారణమయ్యాయి. ఇలాంటి దాడుల వల్ల చాలామంది మానసికంగా కుంగిపోతున్నారు. కొందరు ఉద్యోగాలు కోల్పోతున్నారు. మరికొందరు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు స్థానం ఉండాలి. కానీ భిన్నాభిప్రాయాలను వ్యక్తిగత దాడులుగా మార్చడం సమాజానికి మంచిది కాదు.

### గోప్యతకు పెరుగుతున్న ముప్పు

వ్యక్తిగత గోప్యత కూడా సోషల్ మీడియా వల్ల తీవ్ర ప్రమాదంలో పడుతోంది. ప్రమాదాలు, హత్యలు, ఆత్మహత్యలు, కుటుంబ వివాదాలు జరిగినప్పుడు బాధితుల ఫోటోలు, వీడియోలు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, చిన్నారుల వివరాలు కూడా విచక్షణ లేకుండా సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. ఒకసారి ఇంటర్నెట్‌లోకి వెళ్లిన సమాచారం పూర్తిగా తొలగించడం దాదాపు అసాధ్యం. అందుకే డిజిటల్ గోప్యతను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యతగా మారింది.

### వైరల్ కు ప్రాధాన్యం.. వాస్తవానికి నిర్లక్ష్యం

సోషల్ మీడియా వేదికల ఆల్గోరిథమ్‌లు కూడా వైరల్ కంటెంట్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. సంచలనాత్మక వార్తలు, కోపాన్ని రెచ్చగొట్టే పోస్టులు, వివాదాస్పద వ్యాఖ్యలు ఎక్కువ మందికి చేరేలా వ్యవస్థ పనిచేస్తోంది. ఫలితంగా నిజమైన సమాచారం కంటే ఉద్రిక్తతను పెంచే పోస్టులే ఎక్కువగా ప్రజల్లోకి వెళ్తున్నాయి. ఇది సమాజంలో విభజనను, ద్వేషాన్ని, అపోహలను మరింత పెంచుతోంది.

### స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా

అయితే సోషల్ మీడియా వల్ల మంచి జరగలేదని చెప్పడం కూడా సరైంది కాదు. ఎన్నో అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వాల దృష్టికి చేరని ప్రజా సమస్యలు వెలుగులోకి వచ్చాయి. విపత్తుల సమయంలో సహాయక చర్యలు వేగంగా జరిగాయి. సాధారణ పౌరుడికి కూడా తన అభిప్రాయాన్ని ప్రపంచానికి చెప్పే అవకాశం లభించింది. కానీ స్వేచ్ఛకు బాధ్యత కూడా తోడుగా ఉండాలి. బాధ్యత లేకుండా ఉపయోగించే స్వేచ్ఛ సమాజానికే ప్రమాదంగా మారుతుంది.

### బాధ్యతాయుత డిజిటల్ పౌరసత్వం అవసరం

ప్రతి సోషల్ మీడియా వినియోగదారుడు చూసిన ప్రతి సమాచారాన్ని వెంటనే నమ్మకూడదు. నిర్ధారణ లేని వార్తలను ఫార్వర్డ్ చేయకూడదు. విచారణ పూర్తికాకముందే ఎవరినీ నేరస్తుడిగా ముద్ర వేయకూడదు. వ్యక్తిగత గోప్యతను గౌరవించాలి. భిన్నాభిప్రాయాలను సహించాలి. వాస్తవాలను పరిశీలించే అలవాటు పెంచుకోవాలి. అదే నిజమైన డిజిటల్ పౌరసత్వం.

### చట్టం, సంస్థల పాత్ర

ప్రభుత్వాలు ఫేక్ న్యూస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి. సోషల్ మీడియా సంస్థలు నకిలీ ఖాతాలు, ద్వేష ప్రచారం, తప్పుడు సమాచారాన్ని నియంత్రించేందుకు మరింత బాధ్యతగా వ్యవహరించాలి. అదే సమయంలో భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకుండా సమతుల్యత పాటించడం కూడా అవసరం. పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ లిటరసీ, మీడియా లిటరసీపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలి.

### ఎడిటోరియల్ నోట్ :

సోషల్ మీడియా న్యాయస్థానం కాదు. అది ప్రజల అభిప్రాయాలను వ్యక్తం చేసే వేదిక మాత్రమే. న్యాయం చేయాల్సింది చట్టం, కోర్టులు, రాజ్యాంగ వ్యవస్థలే. ప్రతి వైరల్ పోస్టు నిజం కాదు. ప్రతి ట్రెండింగ్ హ్యాష్‌ట్యాగ్ న్యాయం కాదు. ప్రతి కామెంట్ తీర్పు కాదు. సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందినా న్యాయం మాత్రం ఆధారాలు, చట్టం, నిష్పాక్షిక విచారణ మీదే నిలబడాలి. లేదంటే రేపటి సమాజంలో నిజం కంటే వైరల్ అనే పదానికే విలువ పెరిగి, ప్రజాస్వామ్యం, వ్యక్తి స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ అన్నీ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

**సాయి మణికంఠ**
**మేనేజింగ్ ఎడిటర్, నవజ్యోతి తెలుగు దినపత్రిక**

# కామారెడ్డికి రూ.105.91 కోట్ల అభివృద్ధి నిధులు

- రూ.75.19 కోట్ల గ్రామీణ రహదారులు.. రూ.30.72 కోట్లతో ప్రధాన రహదారుల బలోపేతం...



**కామారెడ్డి, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**

కామారెడ్డి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అలీ కృషి ఫలితంగా వివిధ శాఖల ద్వారా మొత్తం రూ.105.91 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరయ్యాయి. గ్రామీణ రహదారులు, ప్రధాన రహదారుల అభివృద్ధికి ఈ నిధులు వినియోగించనున్నట్లు వెల్లడించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో హెచ్ఏఎం (HAM) ఏజెన్సీ ద్వారా నియోజకవర్గంలోని 42 గ్రామీణ రహదారి పనులకు రూ.75.19 కోట్లు మంజూరు చేశారు. ఈ పనుల ద్వారా మొత్తం 116.85 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారుల అభివృద్ధి చేపట్టనున్నారు. ఈ పనులు భిక్కనూరు, బీబీపేట్, దోమకొండ, కామారెడ్డి, మాచారెడ్డి, రాజంపేట్, రామారెడ్డి మండలాల్లో అమలు కానున్నాయి. అదే విధంగా రోడ్లు–భవనాల (ఆర్అండ్బీ) శాఖ హెచ్ఏఎం ఫేజ్-1 కింద రూ.30.72 కోట్లతో రెండు ప్రధాన రహదారుల బలోపేతానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎన్‌హెచ్-44 నుంచి బురుగుపల్లి–రాజంపేట–గుండారం రహదారి (8 కి.మీ.), కామారెడ్డి–తుంపల్లి రహదారి (28.16 కి.మీ.) బలోపేతం చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి ఘనంగా సన్మానించారు. కామారెడ్డి అభివృద్ధికి భారీ నిధులు మంజూరు చేసినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రోడ్లు–భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఫోన్ ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి వేగంగా సాగుతోందని పేర్కొన్నారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ కామారెడ్డి అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. త్వరలో ఎఫ్‌డీఏ (FDA) నిధుల కింద రూ.25 కోట్లు, మరో రూ.20 కోట్లు, అలాగే సీఆర్ఆర్ (CRR) నిధుల కింద రూ.32 కోట్లు మంజూరు కానున్నాయని వెల్లడించారు. గ్రామీణ మౌలిక సదుపాయాలు, రహదారులు, తాగునీటి సౌకర్యాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటికే మంజూరైన రూ.105.91 కోట్లతో గ్రామీణ, ప్రధాన రహదారుల అభివృద్ధి వేగవంతం కానుండగా, రానున్న రోజుల్లో అదనపు నిధులతో కామారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని షబ్బీర్ అలీ తెలిపారు.



# "తరగతి గదిలోకే డీఈవో...విద్యార్థుల ప్రతిభకు ప్రత్యక్ష పరీక్ష!"

- **ల్యాబ్ నుంచి లైబ్రరీ వరకు...ప్రతి విభాగాన్ని పరిశీలించిన డీఈవో**
- **పుస్తకం తెరిపించిన డీఈవో...విద్యార్థులతో ముఖాముఖి**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) రేణుకాదేవి జీడిమెట్ల జెడ్పీహెచ్ఎస్‌ను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల నిర్వహణ, బోధన నాణ్యత, విద్యార్థుల అభ్యాస స్థాయిని ప్రత్యక్షంగా పరిశీలిస్తూ తరగతి గదుల్లోనే విద్యార్థులతో మమేకమయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి పాఠశాలలో అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన పథకం, లైబ్రరీ వినియోగం, క్రీడా కార్యకలాపాలు, తరగతి గదుల నిర్వహణ, విద్యార్థుల అభ్యాస పురోగతిపై డీఈవోకు వివరించారు. అనంతరం పాఠశాలలోని వివిధ విభాగాలను పరిశీలించిన డీఈవో నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన రేణుకాదేవి ప్రతి సబ్జెక్టుపై వారి అవగాహనను పరీక్షించారు. గణితంలో ప్రస్తుతం బోధిస్తున్న యూనిట్, ప్రాజెక్టులు, క్లాస్‌వర్క్, హోమ్‌వర్క్ గురించి ప్రశ్నించగా, ఫిజిక్స్–కెమిస్ట్రీలో ఆమ్లాలు (Acids), ప్రయోగశాల కార్యకలాపాలు, శాస్త్రీయ నిర్వచనాలపై విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. తెలుగు పాఠ్యాంశాల్లో పద్యాలు, కవుల పరిచయం, గద్యభాగంపై ప్రశ్నలు అడిగారు. హిందీ, ఇంగ్లీష్, సోషల్, బయాలజీ సబ్జెక్టుల్లోనూ ముఖ్యమైన అంశాలపై విద్యార్థుల అవగాహనను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విలువైన సూచనలు చేసిన డీఈవో, ఇంటి వద్ద రోజువారీ చదువుకు సమయపాలనతో కూడిన ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఇప్పటి నుంచే ప్రతి సబ్జెక్టుపై క్రమబద్ధంగా దృష్టి సారిస్తే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం సులభమవుతుందని ప్రోత్సహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

# మురుగు ప్రవాహంలో సూరారం...
# చూస్తూ ఊరుకుంటున్న వ్యవస్థ!

- **ఓం జెండా మార్కెట్, గార్డెన్ కేఫ్ సమీపంలో రోడ్లపై డ్రైనేజీ ఉప్పొంగింపు**
- **ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన మురుగు నీటి ప్రవాహం**
- **ఏళ్లుగా అదే సమస్య...తాత్కాలిక మరమ్మతులతో కాలం వెళ్లదీస్తున్న అధికారులు**
- **అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఆధునికీకరణే శాశ్వత పరిష్కారమంటున్న స్థానికులు**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 5: (నవజ్యోతి ప్రతినిధి) :**





స్మార్ట్ సిటీ, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్రకటనలు చేస్తున్నా,కొంపల్లి సర్కిల్ పరిధిలోని సాయిబాబానగర్ డివిజన్ సూరారం కాలనీలో డ్రైనేజీ సమస్య మళ్లీ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఓం జెండా మార్కెట్ రహదారితో పాటు గార్డెన్ కేఫ్ పక్కనున్న గల్లీలో మురుగు నీరు రోడ్లపై ఏరులై పారుతుండటంతో ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నా, సంబంధిత హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బి అధికారులు మాత్రం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రద్దీ మార్కెట్...మురుగు నీటిలోనే రాకపోకలు**

ఓం జెండా మార్కెట్ నిత్యం వందలాది మంది కొనుగోలుదారులతో కిటకిటలాడే ప్రాంతం. ఇదే మార్గంలో విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, వృద్ధులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్డంతా మురుగు నీటితో నిండిపోవడంతో ప్రజలు అడుగడుగునా ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు జారిపడే ప్రమాదం ఉండగా, పాదచారులు మురుగు నీటిని దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

**గార్డెన్ కేఫ్ గల్లీ...వారంరోజులుగా అదే దుస్థితి**

గార్డెన్ కేఫ్ సమీపంలోని గల్లీలో గత వారం రోజులుగా డ్రైనేజీ నీరు నిరంతరంగా రోడ్డుపై ప్రవహిస్తోంది. ఇది ప్రధాన రహదారికి అనుసంధాన మార్గం కావడంతో రోజంతా భారీగా రాకపోకలు కొనసాగుతున్నాయి. దుర్వాసనతో పాటు దోమల బెడద కూడా పెరిగిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని వారు చెబుతున్నారు.

**ఏళ్ల సమస్య...తాత్కాలిక మరమ్మతులకే పరిమితం**

సూరారం కాలనీలో ఓం జెండా మార్కెట్ రోడ్డులో

ఈ డ్రైనేజీ సమస్య కొత్తది కాదని, ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. పైపుల సామర్థ్యం తగ్గిపోవడం, మురుగు నీటి ప్రవాహానికి సరిపడా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల తరచూ రోడ్లపైకి మురుగు నీరు వస్తోందని పేర్కొంటున్నారు. అధికారులు అప్పుడప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేసినా, శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అంటువ్యాధుల ముప్పు**

మురుగు నీరు రోజంతా రోడ్లపై నిల్వ ఉండటంతో దుర్వాసన వ్యాపిస్తోంది. దోమలు అధికంగా పెరగడంతో డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యవసర చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


**అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పునర్నిర్మాణమే పరిష్కారం**

సూరారం కాలనీలో పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను విస్తరించకపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పాత యూజీడీ లైన్లను పూర్తిగా మార్చి, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొంటున్నారు.

# చదువుకున్నవారే అధికంగా సైబర్ నేరలకు గురవుతున్నారు...

- **సైబర్ మోసాలపై యువత అప్రమత్తంగా ఉండాలి...**
- **నకిలీ స్టాక్ మార్కెట్ ప్రకటనలను నమ్మొద్దు...**
- **ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగితే అది మోసం....**
- **సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి**
- **తూప్రాన్ సీఐ వెంకట్ రాజా గౌడ్...**

**మనోహరబాద్, 05 ఆగష్టు ( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ) :**




సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, ప్రజలు డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తంగా వ్యవహరించాలని తూప్రాన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్ రాజా గౌడ్ సూచించారు. జాతీయ 'సైబర్ జాగృత్ దివస్' సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా కా తిరంగా–సైబర్ స్వతంత్ర తెలంగాణ' కార్యక్రమంలో ఎస్ఐ సుభాష్ గౌడ్ బుధవారం మనోహరబాద్ మండలంలోని కాళ్ళకల్ ( జేఎంజే ) స్కూల్ పాఠశాలలో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న తూప్రాన్ సీఐ ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణలో ప్రతిరోజూ సైబర్ నేరాల కారణంగా కోట్ల రూపాయలను ప్రజలు నష్టపోతున్నారని సీఐ తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే నకిలీ స్టాక్ మార్కెట్ పెట్టుబడి ప్రకటనలను చూసి మోసపోవద్దని సూచించారు. మోసగాళ్లు ముందుగా వాట్సాప్ గ్రూపుల్లో చేర్చి, కొందరు వ్యక్తులు భారీగా లాభాలు పొందినట్లు నకిలీ స్క్రీన్‌షాట్లు, సందేశాలను షేర్ చేస్తారని చెప్పారు. వాటిని నమ్మి పెట్టుబడులు పెడితే తొలుత కొద్దిమొత్తంలో లాభాలు వచ్చినట్లు చూపించి, అనంతరం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించిన తర్వాత మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వివిధ రకాల ఫీజుల పేరుతో డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకట్ రాజా గౌడ్ సూచించారు. ఒకసారి డబ్బులు చెల్లించిన తర్వాత మరో ఫీజు, ఇంకో ఫీజు అంటూ వరుసగా డబ్బులు వసూలు చేస్తారని తెలిపారు. చివరకు భారీ మొత్తంలో డబ్బులు కోల్పోయిన తర్వాతే మోసపోయిన విషయం బాధితులకు తెలుస్తుందన్నారు. ఉద్యోగం ఇచ్చే సంస్థ అభ్యర్థికి జీతం చెల్లిస్తుంది కానీ, ఉద్యోగం ఇచ్చేందుకు అభ్యర్థి నుంచి డబ్బులు ఎందుకు అడుగుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డులు, ఏటీఎం/డెబిట్ కార్డు వివరాలు వంటి వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు, ఫేక్ అకౌంట్లు, ఫిషింగ్ లింకులు తదితర సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడంతో పాటు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంచుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి పౌరుడు బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరుడిగా వ్యవహరించినప్పుడే 'సైబర్ స్వతంత్ర తెలంగాణ' లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. చివరగా విద్యార్థులతో సైబర్ అవగాహనా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుభాష్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీహార్ నుంచి 'మత్తు చాక్లెట్లు'...
# దుండిగల్‌లో దందా గుట్టురట్టు

- **తండాలో మత్తు చాక్లెట్ల కలకలం...ఎస్‌వోటీ, దుండిగల్ పోలీసులు దాడిలో అసలు కథ బయటకు**
- **లేబర్లకు మత్తు సరఫరా...71 గంజాయి చాక్లెట్లతో అరెస్ట్**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 5: ( నవజ్యోతి ప్రతినిధి) :**



దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి చాక్లెట్ల విక్రయానికి పాల్పడుతున్న బీహార్‌కు చెందిన వ్యక్తిని కుత్బుల్లాపూర్ ఎస్‌వోటీ, దుండిగల్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, ఆగస్టు 4న సాయంత్రం 4 గంటల సమయంలో దుండిగల్ తండా–2లో బీహార్‌కు చెందిన రంజిత్ కుమార్ గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం అందడంతో అధికారులు దాడి నిర్వహించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద నుంచి 71 గంజాయి చాక్లెట్లు, మొత్తం 350 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో రంజిత్ కుమార్ బీహార్ రాష్ట్రానికి చెందినవాడని, ప్రస్తుతం దుండిగల్ తండా–2లో నివాసం ఉంటూ కాజీపల్లిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో లేబర్‌గా పనిచేస్తున్నట్లు వెల్లడైంది. బీహార్‌లోని తన అత్తగారి గ్రామం నుంచి గంజాయి చాక్లెట్లను కొనుగోలు చేసి దుండిగల్ తండా–2లో ఉన్న ఇతర కార్మికులకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో బయటపడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# మహిళాభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి: సర్పంచ్ దున్నా శ్రీనివాస్

**నడిగూడెం ఆగస్టు 5 ( నవజ్యోతి ప్రతినిధి )**

తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని సర్పంచ్ దున్నా శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నడిగూడెం గ్రామ పంచాయతీ నందు నిర్వహించిన మహిళా సభలో పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో మహిళల అవసరాలను గుర్తించి సభలో తీర్మానం చేసి అమలు చేసేందుకు ప్రభుత్వం మహిళా సభలు నిర్వహిస్తుందన్నారు. ఇప్పటికే మహిళలు ఆర్థికంగా నిలదొక్కునేందుకు మహిళా సంఘాలకు బస్సులు, పెట్రోల్ బంకుల చాలా రోజులు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకంతో పాటు మహిళలకు అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తుందన్నారు. ఆయన వంతుగా రాష్ట్ర మంత్రివర్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల సహకారంతో మహిళా సభలో తీర్మానించిన అంశాలను ప్రాధాన్యతల మేరకు అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, వార్డు సభ్యులు దున్నా మనిషా, పోలే బోయిన విజయ, కాసాని శైలజ, మహిళా ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.



# అర్హులైన నిరుపేదలకే డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలి:




## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి , ఆగస్టు 5 ( నవజ్యోతి ప్రతినిధి):**

డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలకు స్వస్తి చెప్పి అర్హులైన నిరుపేదలకే ఇళ్లను అందజేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. కైతలాపూర్‌లోని డబుల్ బెడ్రూమ్ సముదాయాన్ని బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కైతలాపూర్ నిరుపేదలకు కాకుండా ఇతర ప్రాంతాల ధనికులకు ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. పరిసరాల్లో అపరిశుభ్రత వల్ల విషసర్పాలు వస్తున్నందున వెంటనే శుభ్రం చేయించి ప్రహరీ గోడ నిర్మించాలని అధికారులను ఆదేశించారు.గతంలో అపార్ట్‌మెంట్ల నిర్వహణ కోసం జీవో ఇచ్చినా షట్టర్లను అధికారులు అమ్ముకోవడం దారుణమన్నారు. స్థానిక 87 మంది పేదలకు పారదర్శకంగా ఇళ్లు ఇవ్వకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని, అవసరమైతే ముఖ్యమంత్రి వద్దకు వెళ్తామని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాలు, రహదారుల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, ప్రభాకర్ గౌడ్, మహమ్మద్ గౌసుద్దీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దశ దిన కర్మల కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



**వాజేడు నవ జ్యోతి ప్రతినిధి . ఆగష్టు 05.**

వాజేడు మండల కేంద్రంలో నిర్వహించిన కీ.శే.దంతులూరి విశ్వనాథ ప్రసాద్ రాజు దశదిన కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు , మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మి నారాయణ, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడికుల అశోక్, ఏటూరు నాగారం మండల బ్లాక్ అధ్యక్షులు ఇరుసవడ్ల వెంకన్న.రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీ.శే. ప్రసాద్ రాజు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మారుమూల ప్రాంతాలు, గిరిజన గ్రామాల్లో ప్రజలకు ఆయన అందించిన సేవలను నాయకులు స్మరించుకుంటూ, పార్టీ కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. ప్రజల కోసం నిరంతరం సేవ చేసిన ప్రసాద్ బాబు రాజు సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నాయకత్వం అంటే ఇదే... బాధితుడి ఇంటికి ఆశాకిరణం

- ఎమ్మెల్యే చొరవతో కిడ్నీ మార్పిడి చికిత్సకు సీఎంఆర్ఎఫ్ సాయం
- ఆర్థిక ఇబ్బందులకు చెక్..చికిత్సకు రూ.3.50 లక్షల సాయం



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 5: (నవజ్యోతి ప్రతినిధి)**

అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు చొరవ చూపడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ చొరవతో సూరారం డివిజన్‌కు చెందిన ఓ నిరుపేద బాధితుడికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్ ) ద్వారా రూ.3.50 లక్షల ఎల్ఓసీ ( ఎల్ఓసి ) మంజూరైంది. చింతల్‌లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సూరారం 293 డివిజన్ విశ్వకర్మ కాలనీకి చెందిన అశోక్ కుమార్ పండిత్ కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ పత్రాలను అందజేశారు. కిడ్నీ మార్పిడి చికిత్స అవసరమైన అశోక్ కుమార్ పండిత్ పరిస్థితిని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.3.50 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. ఈ ఆర్థిక సహాయం బాధిత కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చిందని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి : సర్పంచ్ దున్నా శ్రీనివాస్.

**నడిగూడెం ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి)**




అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి తెలంగాణ ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్ 4 నందు చిన్నారికి అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్ ద్వారా గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తుందని, పౌష్టికారాన్ని స్వీకరించాలని, సరైన సమయంలో తీసుకోవాల్సిన పౌష్టికారాన్ని తీసుకుంటేనే పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. అంగన్వాడి సెంటర్ల ఇబ్బందులను గుర్తించి కేంద్రాలకు ప్రభుత్వం పక్కా బిల్డింగులు మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సరిత, పాఠశాల ఉపాధ్యాయురాలు నాగమణి, అంగన్వాడి టీచర్లు స్వర్ణ కుమారి, కొండలమ్మ,సవిత, శకుంతల,కవిత, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## తొలిసారి వచ్చే ముర్రుపాలు బంగారం కంటే విలువైనవని సర్పంచ్ సరిత లక్ష్మణ్,

**నడిగూడెం, జులై 5 (నవజ్యోతి ప్రతినిధి):**

మండల పరిధిలోని వల్లాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కేసగాని సరిత లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లీబిడ్డలిద్దరూ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. తొలిసారి వచ్చే ముర్రుపాలు బంగారం కంటే విలువైనవని, ఇవి శిశువులో వ్యాధి నిరోధక శక్తిని విశేషంగా పెంచుతాయని వివరించారు.అనంతరం విద్యార్థులకు యూనిఫార్మ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఎం. కరుణలత, విద్యా కమిటీ చైర్మన్ మైనంపాటి ఉపేంద్రమ్మ, అంగన్‌వాడీ టీచర్లు షేక్ మహబూబ్, నూకపొంగు గోవిందమ్మ, అంగన్‌వాడీ ఆయా, చిన్నారులు మరియు వారి తల్లులు పాల్గొన్నారు.

# చిట్కుల్‌లో వైభవంగా దుర్గమ్మ జాతర

- జడ్జి శ్రీనిధి ప్రత్యేక పూజలు..
- ఫలారం బండి ఊరేగింపులో నీలం మధు ముదిరాజ్

**పటాన్‌చెరు, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**



ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. జాతర రెండో రోజు సందర్భంగా దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, దుర్గమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జాతర వేడుకలకు చిట్కుల్ గ్రామానికి చెందిన నాగర్‌కర్నూల్ సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, కల్వకుర్తి జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి శ్రీనిధి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు జడ్జి శ్రీనిధిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. తదనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఫలారం బండి ఊరేగింపులను నీలం మధు ముదిరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పురవీధులన్నీ భక్తుల జయజయధ్వానాలు, డప్పు వాయిద్యాలు, సాంప్రదాయ కళారూపాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ క కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, మహిళలు, యువకులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఆటతో ఆత్మవిశ్వాసం..విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తికి వేదిక

- గ్రామీణ ప్రతిభకు గ్రౌండ్ రెడీ..యువతకు రాజేష్ నాయక్ ప్రోత్సాహం
- విద్యార్థి శక్తికి క్రీడలే దిక్సూచి..ఉస్మానియా విద్యార్థి నాయకత్వంలో టోర్నమెంట్

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 5: (నవజ్యోతి ప్రతినిధి)**



గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని పోటీ ప్రపంచానికి సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఉస్మానియా లా స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో, ఉస్మానియా విద్యార్థి నాయకుడు రాజేష్ నాయక్ నేతృత్వంలో గాగిల్లాపూర్‌లోని వైఎన్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, కో-కో టోర్నమెంట్లు ఘనంగా నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఉత్సాహంగా పోటీపడి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాజేష్ నాయక్, విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన, మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. గ్రామీణ యువతలోని క్రీడా సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహించడమే ఈ టోర్నమెంట్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విజేతలకు అభినందనలు తెలియజేసిన నిర్వాహకులు, భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలను నిర్వహించి ప్రతిభావంతులైన విద్యార్థులకు విస్తృత అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడా ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థి నాయకులు విజయ్ కుమార్, అభిలాష్ రెడ్డి, సిరిగాళ్ల బాబు, షాబీర్, శేఖర్, అనూష నాయక్‌తో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు.

# నకిలీ స్టాక్ మార్కెట్ ప్రకటనలను నమ్మొద్దు...

- ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగితే అది మోసమని గుర్తించాలి ....
- సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి
- తూప్రాన్ ఎస్ఐ గంగరాజు.....

**తూప్రాన్ , 05 ఆగష్టు ( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ) :**




సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, ప్రజలు డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తంగా వ్యవహరించాలని తూప్రాన్ ఎస్ఐ గంగరాజు సూచించారు. జాతీయ 'సైబర్ జాగృత్ దివస్' సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా కా తిరంగా–సైబర్ స్వతంత్ర తెలంగాణ' కార్యక్రమంలో బుధవారం తూప్రాన్ మండలంలోని ఘణపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న తూప్రాన్ ఎస్ఐ గంగరాజు ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణలో ప్రతిరోజూ సైబర్ నేరాల కారణంగా కోట్ల రూపాయలను ప్రజలు నష్టపోతున్నారని సీఐ తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే నకిలీ స్టాక్ మార్కెట్ పెట్టుబడి ప్రకటనలను చూసి మోసపోవద్దని సూచించారు. మోసగాళ్లు ముందుగా వాట్సాప్ గ్రూపుల్లో చేర్చి, కొందరు వ్యక్తులు భారీగా లాభాలు పొందినట్లు నకిలీ స్క్రీన్‌షాట్లు, సందేశాలను షేర్ చేస్తారని చెప్పారు. వాటిని నమ్మి పెట్టుబడులు పెడితే తొలుత కొద్దిమొత్తంలో లాభాలు వచ్చినట్లు చూపించి, అనంతరం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించిన తర్వాత మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వివిధ రకాల ఫీజుల పేరుతో డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒకసారి డబ్బులు చెల్లించిన తర్వాత మరో ఫీజు, ఇంకో ఫీజు అంటూ వరుసగా డబ్బులు వసూలు చేస్తారని తెలిపారు. చివరకు భారీ మొత్తంలో డబ్బులు కోల్పోయిన తర్వాతే మోసపోయిన విషయం బాధితులకు తెలుస్తుందన్నారు. ఉద్యోగం ఇచ్చే సంస్థ అభ్యర్థికి జీతం చెల్లిస్తుంది కానీ, ఉద్యోగం ఇచ్చేందుకు అభ్యర్థి నుంచి డబ్బులు ఎందుకు అడుగుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, ఏటీఎం/డెబిట్ కార్డు వివరాలు వంటి వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు, ఫేక్ అకౌంట్లు, ఫిషింగ్ లింకులు తదితర సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడంతో పాటు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంచుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి పౌరుడు బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరుడిగా వ్యవహరించినప్పుడే 'సైబర్ స్వతంత్ర తెలంగాణ' లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. చివరగా విద్యార్థులతో సైబర్ అవగాహనా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పోలీస్ అక్క , సంగీత, రాజు,ఇంచార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు,పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- నకిలీ స్టాక్ మార్కెట్ ప్రకటనలను నమ్మొద్దు
- ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగితే జాగ్రత్త
- సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి
- తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్....

**తూప్రాన్, చేగుంట, 05 ఆగష్టు ( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ) :**



సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, ప్రజలు డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తంగా వ్యవహరించాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సూచించారు. జాతీయ 'సైబర్ జాగృత్ దివస్' సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా కా తిరంగా–సైబర్ స్వతంత్ర తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా బుధవారం చేగుంట లోని కస్తూరిబా బాలికల పాఠశాలలో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణలో ప్రతిరోజూ సైబర్ నేరాల కారణంగా కోట్ల రూపాయలను ప్రజలు నష్టపోతున్నారని ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే నకిలీ స్టాక్ మార్కెట్ పెట్టుబడి ప్రకటనలను చూసి మోసపోవద్దని సూచించారు. మోసగాళ్లు ముందుగా వాట్సాప్ గ్రూపుల్లో చేర్చి, కొందరు వ్యక్తులు భారీగా లాభాలు పొందినట్లు నకిలీ స్క్రీన్‌షాట్లు, సందేశాలను షేర్ చేస్తారని చెప్పారు. వాటిని నమ్మి పెట్టుబడులు పెడితే తొలుత కొద్దిమొత్తంలో లాభాలు వచ్చినట్లు చూపించి, అనంతరం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించిన తర్వాత మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వివిధ రకాల ఫీజుల పేరుతో డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఒకసారి డబ్బులు చెల్లించిన తర్వాత మరో ఫీజు, ఇంకో ఫీజు అంటూ వరుసగా డబ్బులు వసూలు చేస్తారని తెలిపారు. చివరకు భారీ మొత్తంలో డబ్బులు కోల్పోయిన తర్వాతే మోసపోయిన విషయం బాధితులకు తెలుస్తుందన్నారు. ఉద్యోగం ఇచ్చే సంస్థ అభ్యర్థికి జీతం చెల్లిస్తుంది కానీ, ఉద్యోగం ఇచ్చేందుకు అభ్యర్థి నుంచి డబ్బులు ఎందుకు అడుగుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని డీఎస్పీ సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, ఏటీఎం/డెబిట్ కార్డు వివరాలు వంటి వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని డీఎస్పీ సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు, ఫేక్ అకౌంట్లు, ఫిషింగ్ లింకులు తదితర సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడంతో పాటు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంచుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని డీఎస్పీ కోరారు. ప్రతి పౌరుడు బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరుడిగా వ్యవహరించినప్పుడే 'సైబర్ స్వతంత్ర తెలంగాణ' లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. చివరగా విద్యార్థులతో సైబర్ అవగాహనా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బిక్య నాయక్, పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసుల అవగాహన

- టీజీ మోడల్ కళాశాలలో 'సురక్షా తిరంగా' కార్యక్రమం
- డిజిటల్ భద్రతపై పోలీసుల సూచనలు

**పటాన్‌చెరు,ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**




జాగృతి దివస్ సందర్భంగా ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో టీజీ మోడల్ కళాశాలలో బుధవారం "సురక్షా తిరంగా – సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలు, వాటి నుంచి రక్షణ పొందే మార్గాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిస కాకూడదని, అపరిచితులు పంపే ఏపీకే ఫైళ్లు, అనుమానాస్పద లింకులు,క్యూఆర్ కోడ్‌లను క్లిక్ చేయవద్దని సూచించారు. ఇటువంటి చర్యల వల్ల మొబైల్ ఫోన్లు హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని వివరించారు. అదేవిధంగా ఓటీపీ,యూపీఐ పిన్ , బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎవరికీ చెప్పకూడదని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని సూచించారు. నకిలీ ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లు, లాటరీలు, పెట్టుబడులు, గేమింగ్ రివార్డుల పేరుతో జరిగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ సీఐ సుధీర్ కుమార్, ఎస్సై అక్షిత, ఎస్సై కిష్టా రెడ్డి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ, విద్యార్థులు డిజిటల్ సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిజిటల్ ప్రపంచంలో అవగాహనతో వ్యవహరిస్తేనే సైబర్ నేరాలను సమర్థవంతంగా నివారించవచ్చని పోలీసులు పేర్కొన్నారు.

# వ్యాయామ ఉపాధ్యాయులకు డీఈవో దిశానిర్దేశం

- ఆటలోనే కాదు...నిర్వహణలోనూ ముందుండాలి!
- ప్రతి పాఠశాల నుంచి ఓ ఛాంపియన్...అదే జిల్లా లక్ష్యం

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 5: (నవజ్యోతి ప్రతినిధి)**




మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో పాఠశాల క్రీడలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కసరత్తు ప్రారంభించింది. రానున్న జిల్లా క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు రాష్ట్రస్థాయిలో జిల్లా అగ్రస్థానంలో నిలిచేలా కార్యాచరణ రూపొందించాలనే లక్ష్యంతో జీడిమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గోనె అరుణజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాధికారి రేణుక దేవి మాట్లాడుతూ, క్రీడల అభివృద్ధి ఒక్క విభాగం బాధ్యత కాదని, ప్రతి వ్యాయామ ఉపాధ్యాయుడు జిల్లా ప్రతిష్ఠను మోసే బాధ్యతను గుర్తుంచుకోవాలని సూచించారు. జట్ల ఎంపికలో పారదర్శకత, పోటీల నిర్వహణలో క్రమశిక్షణ, క్రీడాకారుల ప్రోత్సాహంలో నిబద్ధత ఉంటేనే రాష్ట్రస్థాయిలో మెరుగైన విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని జోన్ల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి తగిన శిక్షణ అందించడం, ప్రతి పోటీని నాణ్యతతో నిర్వహించడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రానున్న క్రీడా క్యాలెండర్, పోటీల నిర్వహణ విధానం, బాధ్యతల కేటాయింపు తదితర అంశాలపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించారు. సమావేశంలో డీసీబీ కార్యదర్శి విజయరెడ్డి, జీడిమెట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, జోనల్ కార్యదర్శులు విద్యాసాగర్, శంకర్, యాదయ్య, సత్తిరెడ్డి, రాధిక, మనోహర్, పారిజాత, నాగరాజు తదితరులతో పాటు జిల్లాలోని వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శంకర్ పల్లి లో అక్షరాస్యత, అభివృద్ధి, కార్మిక సంక్షేమానికి పెద్దపీట...

- మూడు కీలక కార్యక్రమాలతో సందడిగా శంకర్ పల్లి మున్సిపల్ కార్యాలయం...
- పారిశుద్ధ్య కార్మికులకు బీమా, అభివృద్ధి పనులపై అధికారుల సమీక్ష...
- మున్సిపల్ వాట్సాప్ సమూహానికే పరిమితమైన సమాచారం...
- విలేకరులకు ముందస్తు సమాచారం కరువు...

**ఉమ్మడి రంగారెడ్డి/ శంకర్ పల్లి, ఆగస్టు 05, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం అక్షరాస్యత, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం, పట్టణ అభివృద్ధి పనులను పరిశీలించడం, పారిశుద్ధ్య కార్మికులకు వ్యక్తిగత ప్రమాద బీమా పత్రాలు అందజేయడం వంటి పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా రేవతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సభలో పదిహేనేళ్లు పైబడిన నిరక్షరాస్యులకు అక్షరాస్యత, లెక్కల పరిజ్ఞానం, జీవన నైపుణ్యాలు పెంపొందించడం, ప్రభుత్వ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలోని వివిధ అభివృద్ధి పనులను పరిశీలించిన అధికారులు, పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మధ్యాహ్నం నిర్వహించిన కార్యక్రమంలో పురపాలక సంఘంలోని 81 మంది పారిశుద్ధ్య కార్మికులకు వ్యక్తిగత ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పథక సంచాలకులు జి. వెంకట నారాయణ, మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ జూలకంటి శ్వేతా పాండురంగా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఏ. యోగేష్, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ వాట్సప్ సమూహానికే పరిమితమైన సమాచారం...**

ప్రజలకు సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాల సమాచారాన్ని కేవలం అంతర్గత సంఘాలకే పరిమితం చేయకుండా, గుర్తింపు పొందిన అన్ని వార్తా సంస్థలు, విలేకరులకు సమానంగా ముందస్తు సమాచారం అందించే విధానాన్ని అధికారులు పాటిస్తే ప్రభుత్వ కార్యక్రమాలు మరింత పారదర్శకంగా ప్రజల్లోకి చేరే అవకాశం ఉంటుందని పలువురు విలేకరులు అభిప్రాయపడుతున్నారు.

## బీజేపీ ఓబీసీ మెదక్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా వడ్ల శ్యాములుచారి నియామకం

**రామాయంపేట, ఆగస్టు 5 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్**

రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా నూతన జిల్లా కమిటీలను ప్రకటించారు. ఇందులో భాగంగా రామాయంపేట మండలం కట్రియాల్ గ్రామానికి చెందిన వడ్ల శ్యాములు చారిని బీజేపీ ఓబీసీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమించారు.ఈ సందర్భంగా శ్యాములు చారి మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలపై చేపట్టే కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. యువతను పార్టీ భావజాలానికి చేరువ చేసి, సోషల్ మీడియా విభాగాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం..

- తెలంగాణలో మార్పు ఖాయం: ఏనుగు సుదర్శన్ రెడ్డి
- మేడిపల్లి 9వ డివిజన్ బీజేపీ కార్యవర్గ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

**మేడిపల్లి, ఆగస్టు 05,(నవజ్యోతి ప్రతినిధి) :**



మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి 9వ డివిజన్ బీజేపీ కార్యవర్గ సమావేశం డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి హాజరై పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై ఉద్యమాల దిశగా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఆరు గ్యారంటీల అమలు, మెట్రో రైలు విస్తరణ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు ఉద్యోగాలు, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆరోపించారు. అనంతరం బీజేపీ యువమోర్చా నాయకుడు బండారు పవన్ రెడ్డి మాట్లాడుతూ, మేడిపల్లి డివిజన్‌లో ప్రజా సమస్యలను విస్మరించిన కాంగ్రెస్, గత ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మేడిపల్లి డివిజన్‌లో బీజేపీ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి జైపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు గీతారామ్, జిల్లా నాయకుడు పల్లె బాలరాజ్ గౌడ్,డివిజన్ ప్రధాన కార్యదర్శి బాల్ రెడ్డి,సుజాత రెడ్డి,నవ్య,ఉపాధ్యక్షులు శేషగిరిరావు,మల్లారెడ్డి,వెంకటరెడ్డి, కార్యదర్శులు పవన్ గౌడ్,స్వప్నతో పాటు బీజేపీ నాయకులు, యువమోర్చా కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## బతుకమ్మ ఉత్సవాలకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు

**కూకట్ పల్లి , ఆగస్టు 5 ( నవజ్యోతి ప్రతినిధి)**




గణేష్ విగ్రహాల నిమజ్జనం, బతుకమ్మ వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. బుధవారం సాయంత్రం రంగధాముని చెరువును వివిధ శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. ఈ ప్రాంతంలో నివాసాలు పెరుగుతున్నందున భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖలకు పది ఎకరాలు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ తక్షణమే మౌలిక వసతులు కల్పిస్తామని, చెరువు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, పోలీసు, హైడ్రా, వాటర్ వర్క్స్ అధికారులు పాల్గొన్నారు.

### నవజ్యోతి ఎఫెక్ట్...

## ఏడు నెలల తర్వాత గ్రీన్ హిల్స్ లో ఫాగింగ్

**ప్రజా సమస్య వెలుగులోకి రాగానే...పరుగులు తీసిన వ్యవస్థ**

**క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని స్థానికుల విజ్ఞప్తి**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 5: (నవజ్యోతి ప్రతినిధి) :**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియా పాత్రకు మరో ఉదాహరణగా దుండిగల్ సర్కిల్ పరిధిలోని బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ హౌసింగ్ కాలనీలో చోటుచేసుకున్న పరిణామం నిలిచింది. "ఎంటమాలజీ విభాగం ఎక్కడ...? గ్రీన్ హిల్స్ వాసుల ఘాటు ప్రశ్న" అనే శీర్షికతో నవజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి కాలనీలో ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. కాలనీవాసుల కథనం ప్రకారం, దుండిగల్ సర్కిల్ ఏర్పడినప్పటి నుంచి దాదాపు ఏడు నెలలుగా కాలనీలో ఒక్కసారి కూడా ఫాగింగ్ నిర్వహించకపోవడంతో దోమల సమస్య తీవ్రరూపం దాల్చింది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో సమస్యను మీడియా ద్వారా ప్రస్తావించగా ఎంటమాలజీ శాఖ వెంటనే స్పందించి ఫాగింగ్ నిర్వహించింది. అధికారుల స్పందనపై కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూనే, ఇది ఒక్కరోజు చర్యకే పరిమితం కాకూడదని స్పష్టం చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారానికి ఒకసారి లేదా కనీసం పది రోజులకు ఒకసారి ఫాగింగ్ నిర్వహించేలా శాశ్వత కార్యాచరణ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## రాసుఖ్ నగర్ లో రూ.8 లక్షలతో రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం

**ముఖ్యమంత్రి సంకల్పంతో అభివృద్ధి వేగం – కాంగ్రెస్ నాయకుల హర్షం**



**నాగారం,ఆగస్టు 05,(నవజ్యోతి ప్రతినిధి) :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం, మేడ్చల్ ఇన్‌చార్జ్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సహకారంతో నాగారం డివిజన్ పరిధిలోని రాసుఖ్ నగర్లో రూ.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు అభివృద్ధి పనులకు బుధవారం ఘనంగా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కాలనీల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చేపట్టిన పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమయ్య యాదవ్, మాజీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కౌకుట్ల జీవన్ రెడ్డి,మాజి కౌన్సిలర్ లు మాదిరెడ్డి వెంకట్ రెడ్డి,పంగా హరిబాబు, సతీష్ గౌడ్,అరిగె రాములు,గండి శ్రీశైలం, బాల్‌రాజ్ యాదవ్, కాలనీ అధ్యక్షుడు దాసు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరూరులో బోనాల పండుగ

సదాశివపేట. ఆగస్టు 5. (నవజ్యోతి ప్రతినిధి)

సదాశివపేట మండలంలోని ఆరూరు గ్రామంలో పోచమ్మ తల్లికి బోనాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పాల్గొని అమ్మవారి బోనం ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలను కలిగి ఉండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటిలోని మహిళలు అమ్మవారికి బోనాలు గ్రామంలోని మహిళలందరూ ఊరేగింపుగా పోచమ్మ తల్లికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం జరిగింది. జోగిని సాయి ప్రియ శివశక్తులు అవతారంతో అందర్నీ ఆకర్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ గడిల రామ్ రెడ్డి, సర్పంచ్ నాయికోటి లావణ్య మధు, ఉపసర్పంచ్ విట్టల్, వార్డు మెంబర్లు నాగేష్, భరత్, రమేష్, అంజయ్య, మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్, మాజీ ఎంపిటిసి శివకుమార్, లలిత, గ్రామ పెద్దలు రాఘవేందర్, బాలయ్య, లక్ష్మణ్ గౌడ్, డాక్టర్ రాజకుమార్, సంగమేశ్వర్, నర్సింలు, కృష్ణ, రమేష్, మానయ్య, నారాయణ గౌడ్రా మంలోని పెద్దలు యువకులు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మవారి దయతో అందరూ చల్లంగా ఉండాలి.

### టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి.

సదాశివపేట. ఆగస్టు 5. (నవజ్యోతిప్రతినిధి)

సదాశివపేట రవీంద్ర నగర్ లోని నల్ల పోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి రావడం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ఆషాడ మాసం అమ్మవారికి బోనాలు సమర్పించినట్లయితే కోరిన కోరికలు తిరుతాయని, భక్తుల నమ్మకం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ గడిల రాంరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక చిరు, ఆశిరెడ్డి, శరత్ చంద్ర, నల్ల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులుఎగమామిడి నాగరాజు, ఎగ మామిడి సురేష్, ఎగమామిడి సునందరావు, పెద్దలోడి పాండు పెద్దలోడి బసంతి, పెద్దలోడి రవీందర్, తలారి శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

### రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిస్తున్న వైద్యులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు బీజేపీ వినతి

మిర్యాలగూడ, ఆగష్టు 05 (నవజ్యోతి ప్రతినిధి)

ప్రాంతీయ ఆసుపత్రిలో పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులను పరీక్షల పేరుతో ప్రైవేట్ ఆసుపత్రులకు పంపిస్తున్నారని, అత్యవసరంగా వచ్చే గర్భిణులను కూడా ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. కొందరు వైద్యులు సమయపాలన పాటించకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రైవేట్ క్లినిక్‌లకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బంటు గిరి, కొంగరి వెంకటరమణ, మూల రాజిరెడ్డి, బంటు సైదులు, రేపాల పురుషోత్తం రెడ్డి, చిలుకూరి శ్యామ్, చిల్లంచర్ల అభి, కంచుకొమ్ముల వేణు, నక్క రవి, వెంకటేశ్వర్లు, మోదాల అశోక్, కవితా రెడ్డి, కోడి ప్రవీణ్, బంటు శివ తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేట మండలం లో సీజ్ చేసిన ఇసుక డంపుల బహిరంగ వేలం.

### రూ.2.18 లక్షలకు దంతేపల్లి సర్పంచ్ బాలరాజుకు దక్కిన ఇసుక.

రామాయంపేట,ఆగస్టు 5 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :

మెదక్ జిల్లా రామాయంపేట మండలంలో గత జూలై నెలలో రెవెన్యూ అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. మైనింగ్ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బుధవారం రామాయంపేట తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆ ఇసుక డంపులను బహిరంగ వేలం వేశారు. వేలం ప్రక్రియలో మొత్తం తొమ్మిది మంది పాల్గొనగా, రామాయంపేట మండలం దంతేపల్లి గ్రామ సర్పంచ్ బాలరాజు అత్యధికంగా రూ.2,18,000కు వేలం పాట పాడి ఇసుక డంపులను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రజనీకుమారి మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకుని నిబంధనల ప్రకారం బహిరంగ వేలం నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా అక్రమ ఇసుక నిల్వలు లేదా రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే రెవెన్యూ శాఖకు తెలియజేయాలని ప్రజలను కోరారు. వేలంలో దక్కించుకున్న ఇసుకకు సంబంధించి పూర్తి మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు చెల్లించిన అనంతరమే ఇసుకను స్వాధీనం చేసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవీన్ కుమార్,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపి,గౌస్ తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో షీ టీం అవగాహన సదస్సు

- ఈవ్ టీజింగ్, సైబర్ మోసాలపై షీ టీం హెచ్చరిక
- సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి

వేములపల్లి, ఆగష్టు 05 (నవజ్యోతి ప్రతినిధి)

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మిర్యాలగూడ షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియాలో జరిగే మోసాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద సంఘటనలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను లేదా షీ టీంను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దీన సుజాత మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంపొందించుకుని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ షీ టీం సభ్యులు, వేములపల్లి మండల సైబర్ క్రైమ్ బృందం, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పసిపిల్లలకు తల్లిపాలే అమృతం – సర్పంచ్ ఆరూరి నరేష్

మాడుగులపల్లి, ఆగష్టు 05 (నవజ్యోతి ప్రతినిధి)



దామరచర్ల ప్రాజెక్టు పరిధిలోని మాడుగులపల్లి సెక్టార్, ఉప ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ఆరూరి నరేష్ హాజరై మాట్లాడుతూ, పసి పిల్లలకు తల్లిపాలు అమృతంతో సమానమని, అవి వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు అవసరమైన పోషకాలు అందిస్తాయని అన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా పర్యవేక్షకురాలు జి.లక్ష్మి మాట్లాడుతూ, శిశువు జన్మించిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని, అవి కామెర్ల నుంచి రక్షణ కల్పిస్తాయని తెలిపారు. తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీరు లేదా ఇతర ద్రవాలు ఇవ్వకూడదని సూచించారు. అనంతరం అనుబంధ పోషకాహారంతో పాటు రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలు కొనసాగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మధ్యస్థాయి ఆరోగ్య సేవల అధికారి మణి, అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు మరియమ్మ, సుశీల, అరుణశ్రీ, సాయమ్మ, ఏఎన్ఎం ఆండాలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కాప్రా–మల్లాపూర్ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

- ఎంఎంసీ కమిషనర్ కు వినతిపత్రం అందజేసిన ఉప్పల్ కాంగ్రెస్ ఇన్ ఛార్జ్ పరమేశ్వర్ రెడ్డి

కాప్రా, ఆగస్టు 05,(నవజ్యోతి ప్రతినిధి) :



కాప్రా, మల్లాపూర్ డివిజన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి, పరిపాలనా అనుమతులు వెంటనే జారీ చేయాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, కాప్రా, మల్లాపూర్ ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, కల్వర్టులు, ఓపెన్ జిమ్‌లు వంటి ప్రజలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాల పనులను వెంటనే చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పనులు పూర్తయితే రహదారి అనుసంధానం మెరుగుపడటంతో పాటు ప్రజలకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. వినతిపత్రంపై స్పందించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సమస్యలను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.వినతిపత్రంలో గాంధీనగర్, నాయక్ నగర్, బంజారా కాలనీ, సాయిబాబా నగర్, వంపుగూడ, యాదవ్ బస్తీ, ఎల్లారెడ్డిగూడ, లక్ష్మీనగర్, న్యూ నరసింహ నగర్, పిట్టల బస్తీ తదితర ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్లు, కల్వర్టులు, ఓపెన్ జిమ్‌ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జి. విఠల్ నాయక్,కాలనీవాసులు,కాంగ్రెస్ నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బీపీసీఎల్ తెలంగాణ కార్మికులకు అండగా బొంతు దంపతులు

- రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుతో చర్చించి సమస్య పరిష్కారానికి చొరవ

చర్లపల్లి, ఆగస్టు 05, (నవజ్యోతి ప్రతినిధి) :



చర్లపల్లిలోని బీపీసీఎల్ యూనిట్ లో దాదాపు మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న తెలంగాణ కార్మికుల ఉపాధి సమస్య పరిష్కారానికి మాజీ ఎమ్మెల్యే బొంతు రామ్మోహన్, కాంగ్రెస్ నాయకురాలు బొంతు శ్రీదేవి యాదవ్ చొరవ చూపారు.బీపీసీఎల్ ఎంప్లాయీస్ తెలంగాణ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో లోడింగ్, అన్ లోడింగ్ విభాగంలో పనిచేస్తున్న 58 మంది కార్మికులు గత మూడేళ్లుగా టెండర్ ప్రక్రియ లేకుండానే ఇతర రాష్ట్రాల కార్మికులను నియమించడం వల్ల స్థానిక కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఇటీవల రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో బొంతు రామ్మోహన్, బొంతు శ్రీదేవి యాదవ్ కార్మికులతో కలిసి రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబును మరోసారి కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యకు తగిన పరిష్కారం చూపాలని ఆదేశించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన బొంతు రామ్మోహన్, బొంతు శ్రీదేవి యాదవ్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## కుషాయిగూడలో ఈ-పెట్టీ కేసుల నిందితులకు కోర్టు శిక్షలు

- మహిళల పట్ల అసభ్య ప్రవర్తనకు జైలు శిక్ష
- 10 మంది ఈ-పెట్టీ కేసుల నిందితులకు కోర్టు తీర్పు
- కుషాయిగూడ పోలీసుల చర్యలు.. నిందితులకు శిక్షలు

కుషాయిగూడ, ఆగస్టు 05,(నవజ్యోతి ప్రతినిధి) :



కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు ఈ–పెట్టీ కేసుల్లో నిందితులుగా ఉన్న 10 మంది వ్యక్తులను మంగళవారం కుషాయిగూడ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు.గౌరవ న్యాయమూర్తి సర్వ లక్ష్మి విచారణ అనంతరం గాంధీనగర్, కాప్రాకు చెందిన నలుగూరి రమేష్ మహిళల పట్ల అమర్యాదగా ప్రవర్తించిన కేసులో సీపీ చట్టం సెక్షన్ 70(B) కింద రెండు రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.50 జరిమానా విధించారు.అదేవిధంగా నార్త్ కమలనగర్, కుషాయిగూడకు చెందిన గుత్తికొండ రాజేష్ పై నమోదైన కేసులో సీపీ చట్టం సెక్షన్ 70(C) కింద ఒక రోజు సమాజ సేవ నిర్వహించాలని కోర్టు ఆదేశించింది.మిగిలిన ఎనిమిది మంది నిందితులకు నమోదైన ఈ–పెట్టీ కేసుల్లో సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానాలు విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

## రామాయంపేటలో గద్దర్ వర్ధంతి సభ పోస్టర్ల ఆవిష్కరణ : గుండా ఎల్లం.

రామాయంపేట,ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :

మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపల్ కేంద్రంలోని తెలంగాణ ఉద్యమకారుల క్యాంప్ కార్యాలయంలో ప్రజాయుద్ధనౌక గద్దర్ 3వ వర్ధంతి సభ పోస్టర్లను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండా (దాస్) ఎల్లం ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాకవి గద్దర్ తన ఆరు దశాబ్దాల జీవితాన్ని పీడిత ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, తెలంగాణ ఆకాంక్షలు మరియు ప్రజా ఉద్యమాల కోసం అంకితం చేశారని పేర్కొన్నారు.భౌతికంగా గద్దర్ దూరమైనా ఆయన ఆశయాలు, ప్రజా చైతన్యాన్ని రగిలించిన పాటలు, సమానత్వ సందేశం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని అన్నారు. గద్దర్ చేసిన పోరాట స్ఫూర్తిని భావితరాలకు చేర్చేందుకు గద్దర్ ఫౌండేషన్ కృషి చేస్తోందని తెలిపారు. గద్దర్ కుమారుడు సూర్యం ఆధ్వర్యంలో ఆగస్టు 6న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సాయంత్రం 4 గంటలకు నిర్వహించే 3వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని, ప్రజలు, ఉద్యమకారులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గంగా రాములు, సిద్ధరాములు, నక్క శ్రీనివాస్, పుట్టి సిద్ధరాములు, నందిగామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల గుర్తింపు కార్డు కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్

మిర్యాలగూడ, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి)




పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక దివ్యాంగుల గుర్తింపు కార్డు (యూడీఐడీ) కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఆసుపత్రిలోని యూడీఐడీ కేంద్రాన్ని పరిశీలించి, వైద్యాధికారులను కేంద్రం పనితీరు, దివ్యాంగులకు అందించనున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దివ్యాంగులకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో ప్రత్యేక దివ్యాంగుల గుర్తింపు కార్డు (యూడీఐడీ) కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి వేగవంతంగా గుర్తింపు కార్డులు జారీ చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) రమణారెడ్డి, మిర్యాలగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీజా రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ), ఆసుపత్రి వైద్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published, Owned by MANNE LAXMAN Printed at Saketh Publications, 312, Trinetra Complex, Sangareddy, Telangana 502001 Published from SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001 P.H: 9908123780, Email:navajyothinews@gmail.com, RNI no. TGTEL/25/A2372, EDITOR: MANNE LAXMAN